# శిక్ష

వెన్నెల
తెల్లగా-సుఖంలా,

గాలి
చల్లగా-సంతోషంలా.
వెన్నెల వెన్నెల్ని తాగుతూ,
గాలి చల్లదనాన్ని అనుభవిస్తూ,
కాళ్ళు రెండూచాపి, చెట్టుకు జారబడి
కోటయ్య.
నోట్లో చుట్ట ఎర్రగా కాలుతూ!
దట్టంగా డొంకలు
గుబురుగా చెట్లు
వ్రణాల్లా గుడిసెలు
ఊరికి దూరంగా నెట్టివేయబడ్డ
మనుషులు.

గుడిసె లోపల కంచాల్ని కడుగుతూ
రంగి. చుట్ట కాలుస్తూ రంగికోసం.
ఎదురు చూస్తున్న కోటయ్య!
గాలి మోసుకు వచ్చిన దుర్గంధం
పెంటపోగులనుంచి?

"అబ్బా!"
"బాబోయ్"
"ఆఁ, ఆఁ, ఆఁ"

" ఒరే, ఒరే, నువ్వ్రటా" బాధగా బరువుగా కోటయ్య నోట్లో నుంచి మాటలు. గిలగిలా కొట్టుకుంటూ, వంకర్లు తిరిగిపోతూ బాధని భరించలేక కోటయ్య మూలుగు.

తొడదగ్గరకు తెగిపోయినకాలు-మొండిగా. ఎర్రగా!
కోటయ్య ముందు నేలంతా రక్తంతో -కాలువలా!

"రంగీ"

"మావా"

"రంగీ"

"ఆ కేకలేటి మావా" పమిట చెంగుకు చెయ్యి తుడుచుకుంటూ కోటయ్య దగ్గరకు రంగి!

" మావా "

దిక్కులు పిక్కటిల్లేలా రంగి అరుపు!

కోటయ్య పైపడి గుండెలు పగిలేలా రంగి ఏడుపు, పిచ్చిగా, వెర్రిగా, హృదయ విదారకంగా.

"ఎవరు మావా ఇలాసేత్త"

" అప్పిగాడు "

"ఆడా! ఆ సచ్చినోడా! ఆడికేం పొయ్యేకాలం వచ్చినాదీ, ఆడికేం అపకారం సేసీవని ఇంతపని సేసీడు"

రంగి మిగతా గుడిసెల దగ్గరకు పరుగు.

పది పన్నెండుమంది కోటయ్యా వద్దకు.

బండిమీద కోటయ్యా పట్నానికి, అయిదు మైళ్ళ దూరంలో వున్న పట్నానికి, ధర్మాసుపత్రికి.

"ఎవరు నరికారు"

"అప్పిగాడు"

"దేంతో"

"బల్లెంతో"

మరో పావుగంటకు కోటయ్యా నిర్జీవంగా!

జుట్టు పీక్కుంటూ తలకొట్టుకుంటూ రంగి ఏడుపు!

"మావా, యెల్లిపోయావా నన్నిడిసి, నన్నెంత యిదిగా సూసీవో డివి మావా! నువ్వులేకుండా నే నెట్టా బతికేది మావా"

"ఒరేయ్ దొంగ నంజాకొడకా, నా మావను నీ యెదాన్నెట్టుకున్నావురా! పురుగులు పడి సత్తావురా!

"వూరికే యేడిత్తే యేం నాబం, పోయినోడు తిరిగొత్తాడా దయిర్నంగా వుండాల, కాలం తీరిపోనాది, పోనాడు, అప్పిగాడికి తప్పకుండా వురిసిచ్చ పడతాది" రంగిని సముదాయిస్తూ తోటి మనుషులు.

* * *

"అప్పిగా, నువ్వేం దిగులు పడకు. ధైర్యంగా వుండు కోటయ్యా చచ్చాడు, ఇంక నాకేం ఫర్వాలేదు, గూడెంలో మనమాట కెదురుండదు.

పీడ విరగడైపోయింది, లేకపోతే, కూటికి గతిలేని వెధవ, నాకు ఎదురు చెబుతాడా! ఈ వందా పట్టుకుపోయి మజా చేసుకో" మీసం మెలివేస్తూ గోపాలరావు.

"అద్కాద్దొరా. ఆడు సచ్చేముందర నా పేరు సెప్పేడంట, నాకు వురిసిచ్చ పడిపోతాది. ఎట్టాదొర" భయంగా దిగులుగా అప్పిగాడు.

"నేనుండగా నీకేం భయంలేదు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. నువ్వెళ్లు, అంతా నేను చూసుకుంటాగా"

"తపురి దయ దొరా"

* * *

మధ్యాహ్నం
మండుతున్న మూకుడిలా,
ఎండ
దారుణంగా-అన్యాయంలా,
కోర్టు
కుట్రలకు నిలయంలా,
లోపల వెలుపల జనం
గుసగుసలు.

ఏం జరుగుతుందో చూద్దామని ఆత్రుత పడుతూ జనం, కారుతున్న చమటల్ని తుడుచుకుంటూ జనం, వేడిగా కొడుతున్న గాలుపుల్ని లెక్క-చెయ్యకుండా జనం,

"కేసు కొట్టేసారు"

"అదేంటి"

"అదంతే"

"మరి అప్పిగాడు సంపినాడని కోటయ్య సెప్పేడు కదా"

"బల్లెంతో నరకడం కుదర్దని డాకటరు బాబు సెప్పేడు, బల్లెంతో పొడుత్తారు కానీ ఎలా నరుకుతారని పాయింటు తీసేడు. దాంతో కేసు కొట్టేసారు"

"అయితే మాత్తరం"

"కోటయ్య సంది పేలాపనలతో అట్టా సెప్పేడంట, అంచేత నరికి నోడికోసం గాలిత్తారంట"

"యిసిత్తరంగా ఉన్నాది. అలా సూడండి"

"గోపాలం బాబూ, డాకటరు బాబూ కల్సిపోతున్నారు"

"గోపాలం బాబు డాకటరు బాబుకు డబ్బు పారేసుంటాడు"

"అందుకే ఆడు అలా సెప్పాడు"

రంగి ఇవన్నీ వింటోంది, కోపంతో పళ్ళు గిట్టకరుస్తోంది.

'ధూ' అని వుమ్మేసింది.

"ఎంతన్నాయం! అప్పిగాడికి సిచ్చెయ్యకుండా ఒదిలేశారా. ఇదేం నాయం. ఈ నాయమూర్తులు సేసే నాయం ఇదేనా! ఆళ్ళ మాత్తరం నాయం ఎంతవరకూ సెయ్యగల్రు! మహాసేత్తే అప్పిగాడికి సిచ్చెయ్యగల్రు! నిజానికి మావమీద అప్పిగాడికి కోపం ఏవన్నా వున్నాదా! ఆ గోపాలంబాబూ,

అప్పిగాడూ మాటాడుకుంటుంటే యిన్నానుకదా, ఆ బాబు సంపమన్నాడు డబ్బుకు కక్కుర్తి పడి ఈడు సంపేసాడు"

"సంపినోడ్ని సిచ్చిత్తే సరిపోతాదా! ఎంత మాత్రం సరిపోదు. యీ నాయం సేసే బాబులు సంపినోడ్ని సిచ్చేత్తే సిచ్చిత్తారు కానీ, సంపించినోడ్ని సిచ్చించరు కదా, సంపించె సచ్చినోళ్లను సిచ్చించకపోతే యెట్టాగా! ఆ డాకటరు బాబు గోపాలం బాబుతో లాలూచీపడి యెంత పని సేసేడు" రంగి మనసు ఆలోచన్ల సంద్రంలో,

గోపాలరావునూ, డాక్టర్నీ, వాళ్ల వెనుక వస్తున్న అప్పిగాడ్నీ గుచ్చిగుచ్చి చూస్తూ రంగి నవ్వింది, పిచ్చిగా వెర్రిగా విరగబడి నవ్వింది రంగి.

విచిత్రంగా చూసారు జనం రంగిని, పిచ్చి ఎక్కిందేమో అనుకున్నారు, జాలిగా చూసారు, పాపం అని నిట్టూర్చారు.

* * *

రాత్రి

నల్లగా - దుఃఖంలా.

గాలి

రివ్వున వీస్తూ - విచారంలా.

చెట్లు

అటూ ఆటూ వూగుతూ - తాగినోళ్లలా.

రంగి నెమ్మదిగా నడుస్తూ, గూడెం దాటి గోపాలరావింటికి,

" బాబుగోరూ, బాబుగోరూ "

"ఎవరూ"

"రంగిని బాబూ"

"నువ్వేటే, ఇలా వచ్చావేటి"

"తిండిలేక ఆకల్తో సచ్చి పోతున్నాదొరా. గుడిసెలో ఒక్క-దాన్నీ వుండడానికి భయంగా వున్నాది. తవురు దయసూపిత్తే తవరి పంచ నుంటాన్దొరా." పై పంటితో కింది పెదవిని నొక్కుతూ నడుం కొంచెం వంచి రంగి.

పమిట జారింది.

గోపాలరావు చూపులు రంగిని చూస్తూ వుండి పోయాయి. ఆమె నల్లని ఒంపు సొంపుల్ని ఆబగా తినేస్తూ చూసి, చూసి.

"సర్లే ఇలారా. పాపం, కోటయ్య వచ్చిపోయినందుకు ఎంతో బాధగా వుందే, చాలా మంచి మనిషి. మంచి వాళ్లకు ఇవి రోజులు కావనుకో" వెనుక గదిలోకి నడుస్తూ గోపాలరావు.

రంగి దగ్గరకు వచ్చి, గోపాలరావు ఆమెను కౌగలించుకున్నాడు.

"పాపం దొరా, మమ్మల్ని తవురు ముట్టుకోవచ్చా"

"ఛా ఛా. నాకలాంటి పట్టింపు లేమీ లేవే, నా కంతా సమానమే"

"మరి మొన్నామద్దిన మా అప్పకొడుకు తవురి అబ్బాయి గోర్ని బళ్లో ముట్టుకున్నాదని కొట్టించినారేం దొరా! తవురి అబ్బాయి గోర్ని తలమీంచి తానం సేయించినారేం దొరా"

"దానికీ దీనికీ ఏం సంబంధముందో! అదివేరు, ఇదివేరు" గోపాలరావు రంగి రవిక పట్టుకున్నాడు.

" దీపం దొరా "

" ఏం సిగ్గే రంగీ "

లైటు ఆర్పి " ఎక్కడున్నావే రంగీ " అని తడుముకుంటూ గోపాలరావు చీకట్లో.

సమాధానం మాటల్లో రాలేదు.

" అమ్మా "

" అబ్బా. చచ్చేనేవ్ "

" ఊఁ ఊఁ ఊఁ "

కూలీనాలీ చేసుకుబతికే రంగి చేతిలోకి వచ్చిన వెయ్యి ఏనుగుల బలం, రంగి చేతిలోని కత్తి గోపాలరావు కడుపులో బలంగా దిగి మెలికలుతిరిగి నేలమీదికి వాలిపోయిన గోపాలరావు సన్నగామూలుగుతూ.

" యేటి బాబూ ఆ కేకలు " అంటూ గదిలోకి వచ్చిన అప్పిగాడు.

" యెక్కడున్నారు బాబూ "

" యిదిగో. యిక్కడ "

అప్పిగాడు గట్టిగా అరిచాడు. వుండలా చుట్టుకు పోతూ అరిచాడు. రంగి చేతిలోని కత్తి చురుకుగా అప్పిగాడి వీపులోకి, అప్పిగాడి వీపులోంచి రక్తం రంగి ముఖం మీదకు.

గోపాలరావు మీదకు ఒరిగి పోయాడు అప్పిగాడు

గదిలోంచి బయటకు వచ్చింది రంగి. చీరనిండా రక్తం, ముఖం నిండా రక్తం, కత్తి నిండా రక్తం, చేతుల నిండా రక్తం.

రంగి పరుగు.

ఊరు దాటింది

పట్నంపోయే రోడ్డెక్కింది.

గుండెలోకి బలం నింపుకుంటూ,

కాళ్లల్లోకి సత్తువ తెచ్చుకుంటూ రంగి పరుగిడుతోంది.

మధ్యమధ్యన మొల్లో దాచుకున్న కత్తిని తడిమి చూసుకుంటూ, తెలిక పడుతున్న హృదయంతో. కన్నీరింకిపోయిన కళ్లతో రంగి పరుగిడుతోంది.

లంచగొండి డాక్టరు ఇంటివైపుకి దూసుకుపోతోంది రంగి.

(వసుధ మాసపత్రిక - మే' 71)